
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 31 । ఆగస్టు । 2024



సోమశిలలో 35.36 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 35.36 టీఎంసీలు ఉన్నాయి. 12,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, 4,554 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,240
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,725
3 శాతం జీఎస్టీతో	రూ.6,927
సవర (8 గ్రా)	రూ.55,416

గరిష్టం/కనిష్టం
32.3 /26.5

వాతావరణం

గాలిలో తేమ 81 శాతంగా శుక్రవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శనివారం మబ్బులు చేసి, అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఆడపిల్లగా పుట్టడమే తప్పా?



కోల్‌కతా ఆర్జీకర్ ఆస్పత్రిలో అత్యంత అమానుషంగా వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేశారు. ప్రభుత్వాలు ఎన్ని నీతులు చెబుతున్నా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. జరిగిన ఘటన వింటుంటే భయమేస్తోంది. ఏడుపొస్తోంది. సమాజంలో ఆడపిల్లగా పుట్టడమే తప్పా? నేరమా? అనే ఆవేదన, బాధ కలుగుతుంది. ఇలాంటి సంఘటనలు జరగకుండా వైద్యులకు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా ఘటనకు పాల్పడిన దోషులను తక్షణమే శిక్షించాలి.
– పి.భానుప్రియ, సీనియర్ నర్స్, మాముదూరు ఆరోగ్య ఉపకేంద్రం

అందరూ సమానమనే భావన కల్పించాలి



తల్లిదండ్రులు ఆడైనా, మగైనా సమానమే అనే భావన కలిగించేలా చిన్నప్పటి నుంచే కృషి చేయాలని, నైతిక విలువలు నేర్పించాలి. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తారనే భయం కల్పించాలి. కోల్‌కతా వంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరగకుండా ఇకనైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళా డాక్టర్లకు, నర్సులకు రక్షణ కల్పించేలా, డాక్టర్లపై దాడులు చేస్తే కఠినంగా శిక్షించేందుకు టాస్క్‌ఫోర్సు కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. – డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్

అత్యంత కఠిన చట్టాలు రావాలి



సమాజంలో అన్ని వర్గాలకు చెందిన మహిళలు ఏదో ఒక రూపేణా దాడులకు గురవుతూనే ఉన్నారు. కోల్‌కతా వంటి ఘటనలు ఇంకా కొన్ని చోట్ల జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి దుర్మార్గాలను అడ్డుకునేందుకు ఇప్పుడున్న చట్టాలు చాలవు. తప్పు చేసిన వారికి అత్యంత కఠిన శిక్ష పడేలా నూతన చట్టాలు రావాలి. తప్పు చేయాలన్నా ఆలోచన కలలో కూడా రాకూడదు. డాక్టర్లపై దాడులు చేసే వారిని, మహిళలు, నర్సులతో వంకరగా మాట్లాడే దుర్మార్గులకు తక్షణంగా శిక్ష అమలు చేయాలి. – డాక్టర్ రఫీ, నెల్లూరు



న్యూస్‌రీల్

డ్రెడ్జింగ్‌తో ఇసుక తవ్వకాలు

సంగం: పెన్నానదిలో సంగం వద్ద రీచ్ ఏర్పాటు చేసి డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు జరుపుతామని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సంగం ఇసుక రీచ్ వద్ద శుక్రవారం తహసీల్దార్ సోమ్లానాయక్‌తో కలిసి పరిశీలించారు. రీచ్ వద్ద తవ్వకాలు జరిపేందుకు పనులు ముమ్మరం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రాణం తీసిన విరాళం సొమ్ము

- చెన్నకేశవస్వామి గుడి నిర్మాణానికి విరాళమిచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి
- ఆ డబ్బుల విషయమై జరిగిన గొడవలు
- అవమానంతో ఓ వ్యక్తి ఆత్మహత్య

విడవలూరు: మండలంలోని ముదివర్తిలో చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇచ్చిన విరాళం సొమ్ము విషయమై జరిగిన గొడవల్లో ఓ వ్యక్తి అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. ముదివర్తికి చెందిన కొందరు తమ గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించుకుంటామని, అందుకు విరాళం ఇవ్వాలని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోరారు. ఈ మేరకు రూ.5 లక్షలు విరాళంగా ఆమె అందజేశారు. ఈ నగదును గుడి పనులు ప్రారంభించినప్పుడు ఇస్తామని అంత వరకు ఆ మొత్తాన్ని అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు తలా రూ.లక్ష చొప్పున తీసుకున్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా గుడి నిర్మాణం ప్రారంభించకపోవడంతో అదే గ్రామానికి చెందిన నన్నం దినేష్ (37) ఈ విషయాన్ని పెద్ద మనుషులకు చెప్పి అడిగించాడు. తాము తీసుకున్న డబ్బులు తిరిగి కట్టేందుకు రెండు నెలల సమయం కావాలని అడిగారు. అయితే ఆ రెండు నెలలు గడిచినా డబ్బులు సిద్ధం చేయకపోవడంతో నన్నం దినేష్ వారిని మరోసారి డబ్బు కట్టాల్సిందేనని ఒత్తిడి చేశారు. దీంతో వారు మమ్మల్ని వీధుల్లో పెట్టి అవమానించావంటూ నన్నం దినేష్‌పై దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన దినేష్ బుధవారం రాత్రి పురుగు మందు తాగాడు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దినేష్ మృతిపై అతని సోదరుడు నన్నం సూర్యతేజ ఫిర్యాదు చేశాడు. ఎస్సై సాయిప్రసాద్ విచారణ జరిపి అదే గ్రామానికి చెందిన కొల్లు సుందరం, కొల్లు నితీష్‌కుమార్, కొల్లు స్వరూప్ చంద్ర, కట్టా వెంకయ్యపై కేసు నమోదు చేశారు.

జువ్వలదిన్నె వెలుగులదివ్వె



మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే 'జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్' అందుబాటులోకి వచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం వర్చువల్‌గా జాతికి అంకితం చేశారు. అపార మత్స్యసంపదకు నిలయమైన ఆంధ్రా తీరాన్ని వేటకు అనుకూలంగా మార్చి, ఎగుమతులకు అవకాశం కల్పిస్తే మత్స్యకారుల వలసలను నివారించడంతో పాటు సాగర తీరాన్ని సుసంపన్నంగా మార్చాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే తీరంపై ప్రత్యేక దృష్టి సారించారు. సుమారు 76.89 ఎకరాల్లో రూ.288.8 కోట్ల వ్యయంతో చేపట్టిన జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేశారు. ఎన్నికల సమయంలో హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే స్వయంగా వచ్చి ప్రారంభిస్తానని అప్పటి సీఎం వైఎస్ జగన్ చెప్పడం, ఈలోగా ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది.

- ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్‌గా జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- 72 ఎకరాల్లో రూ.288.80 కోట్లతో నిర్మాణం
- 1,250 బోట్లు నిలిపే సామర్థ్యంతో ఏర్పాటు
- ఏటా అదనంగా 41,250 టన్నుల మత్స్యసంపద

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగుల దివ్వెగా.. జువ్వలదిన్నె మారనుంది. గత ప్రభుత్వం సుమారు రూ.288 కోట్లతో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలోని 555 తీరప్రాంత గ్రామాల్లో ఉన్న సుమారు 6.3 లక్షల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూర్చేలా రెండు దశల్లో సుమారు రూ.3,650 కోట్లతో పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తొలి దశలో రూ.1,204.56 కోట్లతో జువ్వలదిన్నె, బాపట్ల జిల్లా నిజాంపట్నం, కృష్ణా జిల్లా మచిలీపట్నం, కాకినాడ జిల్లా ఉప్పాడ వద్ద హార్బర్ల నిర్మాణం చేపట్టారు. ఫిషింగ్ హార్బర్‌తో ద్వారా ఏటా అదనంగా 41 వేల టన్నుల మత్స్య సంపద లభించడంతో పాటు హార్బర్ ఆధారిత పరిశ్రమల ద్వారా మత్స్యకారులు అదనపు ఆదాయం పొందే మార్గాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. హార్బర్‌తో పాటు 20 ఎకరాల్లో ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్, ఐదు ఎకరాల్లో బోట్ల తయారీ యూనిట్‌ను ఏపీ మారిటైం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. మత్స్యకారులకు అదనపు ఆదాయం సమకూర్చే దిశగా హార్బర్ వద్ద ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ల నిర్మాణంపై కూడా ఏపీ మారిటైం కసరత్తు చేస్తోంది. పైలట్ ప్రాజెక్ట్ కింద జువ్వలదిన్నె హార్బర్ వద్ద 50 ఎకరాల్లో ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. కేవలం మత్స్య సంపద మాత్రమే కాకుండా ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా ప్రాసెస్ చేసేలా ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా కానున్నాయి. ప్రధానంగా మత్స్యకార మహిళలకు, యువతకు స్థానికంగానే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వలసలు పూర్తిగా ఆగిపోనున్నాయి. ఇప్పటి వరకు సరైన వేట, ఉపాధి అవకాశాలు లేక నియోజకవర్గంలోని మత్స్యకారులు తమిళనాడు, పాండిచ్చేరి, ముంబై, గోవా వంటి ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం స్థానికంగానే మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనుండడంతో వలసలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది.

ఏటా అదనంగా 41,250 టన్నుల మత్స్యసంపద

జువ్వలదిన్నెలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ ద్వారా ఇకపై ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా లభించనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు తీరంలో పెద్దబోట్లు నిలిపే అవకాశం లేకపోవడంతో సముద్రంలో 25 నాటికన్ మైళ్ల దూరం దాటి వేట చేపట్టలేకపోయేవారు. ఇప్పుడు ఏకంగా 1,250 బోట్లు నిలిపే సామర్థ్యంతో ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి రావడంతో పెద్దబోట్ల సాయంతో వేటసాగించే అవకాశం లభించింది.

మత్స్యకారుల్లో ఆనందం

జువ్వలదిన్నె వద్ద హార్బర్ నిర్మాణం మత్స్యకారులు కలలో కూడా ఊహించలేదు. ఉపాధి కోసం వలసలు తప్పవనే నిర్లిప్త ధోరణితో ఉన్న మత్స్యకారులకు హార్బర్ ప్రకటన కొత్త ఆశలు రేకెత్తించింది. ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా మత్స్యకారుల కష్టాలు స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తీరంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఏకంగా పది హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు శ్రీకారం చుట్టారు. 2021 మార్చి 19న జువ్వలదిన్నె హార్బర్ పనులు ప్రారంభించి త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయడం, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, తీరప్రాంత గ్రామాల్లో శర వేగంగా వస్తున్న అభివృద్ధి అంతా మత్స్యకారులకు కొత్తగా ఉంది.

80 శాతం సబ్సిడీ మెకనైజ్డ్ బోట్లు ఇవ్వాలి

మత్స్యకారుల వలసలు నివారించాలంటే వారికి 80 శాతం సబ్సిడీతో మెకనైజ్డ్ బోట్లు అందించాలి. చిన్నబోట్లతో ఉపయోగం లేదు. పెద్ద బోట్లు కొనుగోలు చేసే పరిస్థితి మత్స్యకారులకు లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ వల్లే ఈ రోజు జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ ఆవిష్కృతమైంది. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన హార్బర్ కార్యరూపంలోకి రావడం సంతోషకరమైన అంశం. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సబ్సిడీతో బోట్లు అందిస్తే వారికి మేలు చేకూరుతుంది.
– అనిల్, ఆప్కాఫ్ మాజీ చైర్మన్

జేసీబీ, ట్రాక్టర్ పట్టివేత

- అక్రమంగా మట్టి తరలిస్తున్న టీడీపీ నేత

కొడవలూరు: రాత్రి వేళలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండలంలోని కమ్మపాళెం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. చంద్రశేఖరపురానికి చెందిన టీడీపీ నేత కమ్మపాళెం సమీపంలో ఉన్న పైడేరు కాలువ కట్ట మట్టిని రాత్రిళ్లు అక్రమంగా తవ్వేస్తున్నారని స్థానికులు గురువారం రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. కొడవలూరు సీఐ సురేంద్రబాబు అందుబాటులో లేకపోవడంతో విడవలూరు ఎస్సై సాయిప్రసాద్‌కు సమాచారం అందించి తనిఖీ చేయాలని ఆదేశించారు. సీఐ ఆదేశాల మేరకు విడవలూరు ఎస్సై సాయిప్రసాద్ పైడేరు కాలువ వద్దకు చేరుకుని అక్కడ జేసీబీతో కాలువ కట్ట మట్టి తీసి ట్రాక్టర్‌కు లోడు చేస్తుండడాన్ని గుర్తించారు. పరిశీలించి ఎలాంటి అనుమతులు లేవని జేసీబీ, మట్టితో ఉన్న ట్రాక్టర్‌ను కొడవలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కొడవలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించిన జేసీబీ, ట్రాక్టర్

మనిషి మనుగడకు చెట్లే ఆధారం

- ఆరు నగరవనాల ఏర్పాటుకు కృషి
- మంత్రి నారాయణ

నెల్లూరు(అర్బన్): మానవ మనుగడకు చెట్లు, నీరు ఆధారమని రాష్ట్ర మంత్రి నారాయణ అన్నారు. శుక్రవారం కొత్తూరు సమీపంలో ఉన్న నగరవనంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో, సకాలంలో వర్షాలు కురవడంలో, మానవులకు ఆహార, ఇతర అవసరాలు తీర్చడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నెల్లూరులో 21.35 శాతం పచ్చదనం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి వాటిని కాపాడడం ద్వారా పచ్చదనం పెరుగుతుందన్నారు. ప్రజల కోసం రానున్న ఐదేళ్లలో జిల్లాలో ఆరు నగర వనాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ నగర వనాల్లో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నగర వనంలో వ్యూపాయింట్, వాకింగ్ ట్రాకింగ్, ఆట వస్తువులు, ల్యాన్, వివిధ రకాల పక్షులతో ఎంతో ఉల్లాసంగా ఉందన్నారు. ఓపెన్ థియేటర్, వాటర్ ఫాల్ పనులు త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాకుటూరులో నగర వనం కోసం 600 ఎకరాలు గుర్తించామన్నారు. అందులో 100 ఎకరాల్లో పార్కు అభివృద్ధికి ప్రణాళికను సిద్ధంచేశామన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి నగర వనాలను, జిల్లా సైన్స్ సెంటర్, మ్యూజియంను సందర్శించి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. తొలుత విద్యార్థులు, ప్రజలతో కలిసి చెట్లను పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, . ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, మెప్మా పీడీ రవీంద్ర, దొంతాలి సర్పంచ్ రత్నమ్మ, ఆనం విజయకుమార్, ఎంపీటీసీ అరుణమ్మ, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెట్లను కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, ప్రజాప్రతినిధులు

నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 3,10,700 మందికి రూ.131.41 కోట్ల నగదు పంపిణీ
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందు శనివారమే పింఛన్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. సామాజిక పింఛన్లు ఆగస్టు 31న అందకపోతే సెప్టెంబర్ 2న మిగతా వారికి అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలో 3,10,700 మందికి రూ.131,41,75,500 పింఛన్ నగదు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 99 శాతం మందికి శనివారమే అందజేస్తామన్నారు. సంబంధిత ఉద్యోగులు, అధికారులు ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇస్తారని, లబ్ధిదారులు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలన్నారు.

పోలీసులను ఉంచాలి



ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది రాత్రి వేళా విధుల్లో ఉంటారు. కోల్‌కతా ఘటన తరుణంలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఆస్పత్రుల్లో ఏమైనా అనుకోని ఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఇక్కడ పోలీస్ అవుట్‌పోస్టను ఏర్పాటు చేసే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి. అప్పుడే ధైర్యంగా విధులను నిర్వర్తించగలం.

– విజేత, గైనకాలజిస్ట్,
ఆస్పత్రి సూపరింటెండెంట్, కోవూరు సీహెచ్‌సీ

భద్రత చాలా ముఖ్యం



ఆస్పత్రుల్లో రోగులకు సేవలను అందించేందుకు గానూ 24 గంటలూ పనిచేస్తాం. కోల్‌కతా ఘటన నేపథ్యంలో మహిళా వైద్యులు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎవరైనా ఇబ్బంది పెడితే ఏమిటనే ఆందోళన వారిలో నెలకొంటోంది. మహిళా డాక్టర్లకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రుల్లో భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

– వెంకటచలపతి, జనరల్ సర్జన్

చాలీచాలని సెక్యూర్టీ సిబ్బంది



ఆస్పత్రిలో ఎనిమిది మంది సెక్యూర్టీ సిబ్బందికి గానూ ముగ్గురే అందుబాటులో ఉన్నారు. రాత్రి వేళ ఎవరెక్కడుంటారో తెలియదు. ఆపద సమయాల్లో రక్షణ కల్పించే వారెవరు..? కోల్‌కతా ఘటన నేపథ్యంలో మహిళా వైద్యులకు రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అక్కడ దుర్మార్గానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలి.

– సలావుద్దీన్,
జనరల్ మెడిసిన్, కోవూరు



బెగ్గింగ్ మాఫియాపై దాడులు

- ఐదుగురు మహిళల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలో బెగ్గింగ్ మాఫియా ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. నెలలు నిండని చిన్నారుల నుంచి రెండేళ్లలోపు బాలలను చంకనెత్తుకొని ఆకలేస్తోంది.. సాయం చేయండంటూ మహిళలు భిక్షాటన చేస్తున్నారు. ఈ తరహా బెగ్గింగ్‌కు మాఫియా పాల్పడుతోందంటూ కలెక్టర్ ఆనంద్‌కు ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు డీసీపీఓ సురేష్, ఏహెచ్‌టీయూ ఏఎస్సై సతీష్, సిబ్బంది శ్రీహరి, ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, సభ్యులు నిహారిక, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, డీసీపీయూ సిబ్బంది సుమలత, పావని, రత్నం, సుజాత, మహిళా కానిస్టేబుల్ సుప్రజ ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, వీఆర్సీ, గాంధీబొమ్మ తదితర ప్రాంతాల్లో దాడులను శుక్రవారం చేపట్టారు. చిన్నారులతో భిక్షాటన చేస్తున్న నెల్లూరు ఇందిరమ్మకాలనీకి చెందిన లక్ష్మి అలియాస్ బుచ్చి, బుజ్జమ్మ, వల్లూరి, చింతారెడ్డిపాళేనికి చెందిన ఎస్తేర్, తిరుపతి జిల్లా కోటకు చెందిన లక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండేళ్ల వయస్సు కలిగిన ముగ్గురు బాలురు, నాలుగేళ్ల వయస్సు గల బాలికను సంరక్షించి శిశుగృహ, సర్వీస్ హోమ్స్‌లో చేర్పించారు. భిక్షాటన చేస్తున్న మహిళలపై చర్యలు చేపట్టాలని కోరుతూ చిన్నబజార్ పోలీసులకు డీసీపీఓ ఫిర్యాదు చేశారు. మహిళలపై జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ డ్రైవ్‌లో పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. ఎక్కడైనా చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్నారని గుర్తిస్తే 15100, 0861 – 2330579 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.



భిక్షాటన చేస్తున్న మహిళలతో ప్రత్యేక బృంద సభ్యులు



భార్యను ఏమార్చి రెండో వివాహం

- విషయం తెలుసుకొని కల్యాణ మండపానికి చేరుకున్న వైనం
- అప్పటికే పూర్తయిన తంతు
- ఇరువర్గాల గొడవ
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన వ్యవహారం

కందుకూరు: భార్యతో ప్రేమగా ఉంటూనే ఆమె కళ్లుగప్పి మరో వివాహం చేసుకున్నారో ప్రబుద్ధుడు. విషయం తెలుసుకున్న ఆమె కల్యాణ మండపానికి చేరుకునేలోపే మరో యువతితో వివాహం జరిగిపోయింది. దీంతో వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. కందుకూరు పట్టణంలో ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. దగదర్తి మండలం ధర్మవరానికి చెందిన యర్రయ్య కుమారుడు రూబేను బీటెక్ పూర్తి చేశారు. కావలిలోని కచ్చేరి మిట్ట కాలనీలో నివాసం ఉంటున్న అరుణకుమారి, విజయ్‌కుమార్ దంపతుల కుమార్తె నీలిమతో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. దీంతో వీరు 2012లో పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వీరికి కెవిన్ రూబెన్, స్టెఫానీ గోల్డ్ పిల్లలు. ఈ క్రమంలో గ్రామంలో మీ సేవ, ఆన్‌లైన్ సెంటర్‌ను కొంతకాలం నిర్వహించారు. అనంతరం దంపతుల నడుమ ఏర్పడిన విభేదాలు పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లాయి. పెద్దల సమక్షంలో రాజీ చేసుకొని ఇటీవల నుంచి సఖ్యతగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటూ రూబేను హైదరాబాద్ వెళ్లారు. అక్కడే ఉద్యోగం చేస్తున్నట్లు భార్య, పిల్లలను నమ్మించారు. కావలి కోర్టులో ఉద్యోగం చేస్తున్న నీలిమ అక్కడే ఉంటూ పిల్లలను చూసుకోసాగారు.



రూబేను, నీలిమ వివాహ ఫొటో



పోలీస్‌స్టేషన్ వద్ద పిల్లలతో ఆందోళన చేస్తున్న నీలిమ

ఫోన్ నంబర్ బ్లాక్

నిత్యం భార్యాపిల్లలతో ఫోన్లో మాట్లాడే రూబేను అకస్మాత్తుగా నీలిమ నంబర్‌ను బ్లాక్ చేశారు. కోర్టు విధులకు శుక్రవారం హాజరైన నీలిమ.. రూబేనుకు కందుకూరులో మరో వివాహం జరుగుతోందనే విషయాన్ని పాస్టర్ ద్వారా తెలుసుకున్నారు. వెంటనే పిల్లలు, బంధువులతో కలిసి వివాహం జరుగుతున్న ఎస్వీఎస్ కల్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకునేసరికే భర్త రెండో వివాహం పూర్తయిపోయింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రూబేనును స్టేషన్‌కు తరలించారు.

పేరు మార్చుకొని..

వివాహం కోసం తన పేరును ఆదర్శ్‌గా మార్చుకొని కందుకూరు మండలం కోవూరుకు చెందిన శ్రీవాణిని వివాహం చేసుకున్నారు. మొదటి భార్య వచ్చి బండారం బయటపెట్టడంతో పెళ్లి వివాదంగా మారింది. దీంతో శ్రీవాణిని ఆమె తరఫు బంధువులు ఇంటికి తీసుకెళ్లారు.

ఉపాధి కోసం వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- బెంగళూరులో ప్రమాదం

ఉదయగిరి: ఉపాధి నిమిత్తం బెంగళూరు వెళ్లిన వ్యక్తిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఇదే ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. వరికుంటపాడు మండలం జీ కొండారెడ్డిపల్లి పంచాయతీలోని కొత్తపల్లికి చెందిన నాగేంద్ర (28), ఉదయగిరి మండలం సున్నవారిచింతలకు చెందిన దేవండ్ల వెంకటేశ్వర్లు ఉపాధి నిమిత్తం బెంగళూరుకు ఇటీవల వెళ్లారు. వీరిద్దరూ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పని నిమిత్తం బైక్‌పై బెంగళూరు నుంచి హోస్‌కోటెకు గురువారం ఉదయం వెళ్లారు. పనులు ముగించుకొని రాత్రి బయల్దేరగా, వెనుక నుంచి కారు ఢీకొనడంతో రోడ్డు పక్కన పొదల్లో వీరు పడ్డారు. ఘటనలో కారు, బైక్ నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో నాగేంద్ర, వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం గమనించిన వాహనదారులు వీరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నాగేంద్ర మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని సొంతూరికి శనివారం తీసుకురానున్నామని బంధువులు తెలిపారు. కాగా ప్రమాదంలో కారులోని వ్యక్తి సైతం గాయపడ్డారని సమాచారం.



ఘటన స్థలంలో వాహనాలు



నాగేంద్ర (ఫైల్)

గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహం

ఆత్మకూరు: గుట్టుచప్పుడు కాకుండా ఓ బాలికకు తల్లిదండ్రులు వివాహం చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఆత్మకూరు పట్టణ పరిధిలోని ఏసీఎస్సార్ కాలనీకి చెందిన బాలిక (13) సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికుడిగా తండ్రి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెంచలకోనలో బాలికకు తల్లిదండ్రులు వివాహాన్ని బుధవారం జరిపించారని సమాచారం. అనంతరం బాలికను తీసుకొని రాయలసీమలోని వియ్యంకుడి ఇంటికెళ్లారు. కాలనీలోని వారి ఇంటి వద్ద విచారణ చేయగా, వివాహం జరిగింది వాస్తవమేనని తేలింది. తల్లిదండ్రులు ప్రస్తుతం అందుబాటులో లేరని స్థానికులు తెలిపారు. బాలిక అమ్మమ్మ మాత్రమే ఇంటి వద్ద ఉన్నారు. కాగా ఈ విషయమై ఆత్మకూరు సీడీపీఓ సునీలతను సంప్రదించగా, సమాచారం ఆలస్యంగా అందిందని, పలు శాఖల అధికారులతో కలిసి కాలనీలో విచారణను శనివారం చేపట్టనున్నామని తెలిపారు.

కాకర్లను అడ్డుకున్న ఆశ కార్యకర్తలు

కలిగిరి: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వాహనాన్ని కలిగిరిలో సీఐటీయూ నేతలు, ఆశ కార్యకర్తలు శుక్రవారం అడ్డుకున్నారు. టీడీపీ నేత, రావులకొల్లు సర్పంచ్ పూసాల వెంగపనాయుడు తీరుపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి సీఐటీయూ నేతలు పెంచలనరసయ్య, అరుణ తీసుకెళ్లారు. రావులకొల్లులో 16 ఏళ్లుగా ఆశ కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తున్న దళిత మహిళ పందిటి విజయమ్మను తొలగించాలని జిల్లా అధికారులపై వెంగపనాయుడు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. చిరుద్యోగి పొట్టకొట్టడం టీడీపీ నేతలకు తగదని హితవు పలికారు. కాగా దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. ఆశ కార్యకర్త విజయమ్మ ఉద్యోగానికి ఎలాంటి ఢోకా లేదని, ఆమెను తొలగించేదిలేదని స్పష్టం చేశారు. మండల నేతలు, జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



సమస్యను తెలియజేస్తున్న ఆశ కార్యకర్తలు

పారదర్శకంగా బదిలీలు



నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న 165 మంది మహిళా సంరక్షణ కార్యదర్శులను వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రాజెక్టర్‌పై ప్రదర్శించి నిబంధనల మేరకు బదిలీలను జరిపామని వివరించారు. మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఒంటరితనాన్ని భరించలేక మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందుకూరుపేటలోని తూర్పువీధికి చెందిన పావని (30)కి అదే గ్రామానికి చెందిన కరుణాకర్‌తో వివాహమైంది. విభేదాల నేపథ్యంలో భర్త నుంచి విడిపోయి కుమారుడితో కలిసి నవాబుపేటలోని బంగ్లాతోటలో నాలుగేళ్లుగా ఉంటున్నారు. పనులు చేసుకుంటూ కుమారుడ్ని చదివించుకుంటున్నారు. ఒంటరితనాన్ని భరించలేకపోతున్నానని.. చనిపోవాలని ఉందని తల్లి పద్మకు పలుమార్లు చెప్పగా, ఆమె ధైర్యం చెప్తూ వచ్చారు. ఈ క్రమంలో తన ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు గురువారం పాల్పడ్డారు. గమనించిన స్నేహితుడు కృష్ణయ్య ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. విషయాన్ని తల్లికి తెలియజేశారు. నెల్లూరు చేరుకొని కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఘటనపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా


సమస్యల పరిష్కారానికి కృషి



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వేణుగోపాల్ తదితరులు


నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని అగ్నిమాపక కేంద్రంలో చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అభినందన సభను ఏడీఎఫ్‌ఓ వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు.

అనాథ పిల్లల సంరక్షణకు ప్రత్యేక డ్రైవ్



నెల్లూరు సిటీ: అనాథ పిల్లల సంరక్షణకు ప్రత్యేక డ్రైవ్‌ను నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. ఇద్దరు పిల్లలను గుర్తించి వారిని విచారించగా, తాము అనాథలమని, ఎవరూ లేరని చెప్పారు. దీంతో వీరిని సంరక్షణ నిమిత్తం అప్పగించారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, ఏఎస్సై సతీష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, ఎన్జీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి



సిబ్బందితో సుధీర్‌బాబు

నెల్లూరు(క్రైమ్): విధులను అప్రమత్తంగా నిర్వర్తిస్తూ.. ఎవరూ ప్రమాదాలకు గురికాకుండా చూడాలని ఏపీజెన్‌కో చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు ఆదేశించారు. ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ డ్రస్ కోడ్‌ను మారుస్తూ ఉత్తర్వులను ఆ విభాగ డీజీ ఇటీవల జారీ చేశారు. ఈ క్రమంలో ముత్తుకూరు మండలం నేలటూరులోని ఏపీజెన్‌కో కార్యాలయంలో డ్రస్ కోడ్‌ను సుధీర్‌బాబు, అసిస్టెంట్ కమాండెంట్ ఎమ్మెస్ రెడ్డి ఆవిష్కరించి సిబ్బందికి అందజేశారు. సీఐ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి యోగా పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని అవెన్యూస్ స్కూల్లో ఉదయం 8.30కు పోటీలు ప్రారంభంకానున్నాయని చెప్పారు. వివరాలకు 94416 85593, 94407 37171 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సరెండర్ చేసిన అధికారే సిటీ ప్లానర్

నెల్లూరు(బారకాసు): సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా కృష్ణకిశోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్థానంలో ఉన్న దేవీ కుమారిని బదిలీ చేసి తుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా నియమించింది. కాగా గతంలో ఇక్కడ డిప్యూటీ ప్లానర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో కృష్ణకిశోర్ పనితీరు సక్రమంగా లేక ప్రభుత్వానికి అప్పటి కమిషనర్ దినేష్‌కుమార్ సరెండర్ చేశారు. అనంతరం మంగళగిరిలోని ఏపీఐఐసీలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా కృష్ణకిశోర్‌ను సిటీ ప్లానర్‌గా బదిలీ చేయడంపై తోటి ఉద్యోగులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.102
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.190
స్కిన్‌లెస్ చికెన్:	రూ.212
లేయర్ చికెన్ :	రూ.178